**మాదిగ జాతి ముద్దుబిడ్డ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ**




**తహసీల్దార్ కార్యాలయంలో కలకలం**






# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 52 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 21 ఫిబ్రవరి 2025






# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం

- ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- ఎన్‌డి పక్షాన సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు
- ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్

దేశ రాజధాని ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు.

## బిఆర్ఎస్ అండతోనే ఎపిజలదోపిడీ



- కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు
- శ్రీశైలం,సాగర్‌లను ఎపికి అప్పగించి చోద్యం చూశారు
- నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారు
- బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్

## వాటామేరకే నీటిని వాడుకుంటున్నాం



- తెలంగాణ నేతల జలదోపిడి ఆరోపణలపై స్పందించిన చంద్రబాబు
- ఏపీ జల దోపిడీకి పాల్పడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపణ
- కృష్ణా జలాల్లో అధిక నీటిని వాడుకుంటున్నామనే ఆరోపణలను కొట్టిపారేసిన చంద్రబాబు
- వాటా మేరకే నీటిని వినియోగించుకుంటున్నట్లు వెల్లడి

## యూనివర్సిటీలపై కేంద్రం కుట్రలు

- కలసి పోరాడుదామని భట్టి పిలుపు



**తిరువనంతపురం,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** యూనివర్శిటీలపై కేంద్రం కుట్రలపై కలిసి పోరాడుదామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.. కేరళ తిరువనంతపురంలోని జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో పాల్గొన్న ఆయన.. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని మండిపడ్డారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించాలన్నారు. విద్యా, ఆరోగ్య రంగాల్లో రాష్ట్రాల నిర్ణయాలను కేంద్రం గౌరవించాలన్నారు. రాష్ట్రాలు పరిపాలన

వివరాలు 2లో

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

- ఎంపిక చేసిన బిజెపి అగ్ర నాయకత్వం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ రాజధాని ఢిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువు దీరగా, అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్

వివరాలు 2లో

## మొద్దు నిద్రవీడి కృష్ణా జలాల దోపిడీని అడ్డుకోండి

- చేతకాకపోతే చెప్పండి.. మేము చేస్తాం
- బీఆర్ఎస్ పొలాలకు నీళ్లు పారిస్తే.. కాంగ్రెస్ నీళ్లు నములుతుంది : మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది.

వివరాలు 2లో



## అన్నివర్గాలను మోసం చేసిన రేవంత్: కిషన్ రెడ్డి

## ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి



## కెసిఆర్ చెప్పినంత మాత్రాన కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా?

- కెసిఆర్ ఇంకా పగటి కలలుకంటున్నాడు: పిసిసి చీఫ్



**నిజామాబాద్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేసీఆర్ చెప్పినంత మాత్రాన మా కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోయినట్లా అని అని పీసీసీ చీఫ్ బీ. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. నిజామా బాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు పగటి కలలు కనడం అలవాటుగా మారిపో యిందని, ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకు ంటే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. పట్టభ ద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే సత్తాలేని బీఆర్ ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. 'ఫామ్ హౌజ్‌లో విశ్రాంతి తీసుకునే కేసీఆర్‌కు, అభివృద్ధిని పరుగులెత్తించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోలికేంటని' అంటూ మండిపడ్డారు. ప్రజలు తమ వెంటే ఉన్నప్పుడు, కాంగ్రెస్ బలంగా కొనసాగుతున్న సమయంలో, గ్రాఫ్ తగ్గిపోతుందన్న అభిప్రాయం అసత్యమని ఖండించారు. ఫామ్ హౌజ్‌లో కూర్చొని పెన్ను, పేపర్ తీసుకుని గ్రాఫ్ గీస్తే, కాంగ్రెస్ పార్టీకి మద్దతు తగ్గిపోతుందా? అంటూ కేసీఆర్‌ను ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు తమ వెంటే ఉన్నారని, ఏడాదిలో 56,000 ఉద్యోగాలను కల్పించిన విషయాన్ని గుర్తు

వివరాలు 2లో

## యూనివర్సిటీలపై కేంద్రం కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

కాదు..దేశ పురోగతికి జీవనాడులని భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రం యూనివర్శిటీల్లో రాష్ట్రాల పాత్రను తొలగించాలని చూస్తోంది. నియామకాల నుంచి అడ్మిషన్ల వరకు రాష్ట్రాలకు హక్కు లేకుండా చేసే కుట్ర చేస్తోంది. ప్రజలకు వ్యవస్థలకు సరిపోయే విద్యాసంస్థలను రాష్ట్రాలే నిర్మించుకుంటాయి. ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి పోలిక ఉండదు. సొంత నిర్ణయాలు లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రం అందించలేదు.రాష్ట్రాలు ఒక ఉమ్మడి లక్ష్యంతో ఐక్యమైనపుడు కేంద్రం తప్పక వినాలి. ఒక రాష్ట్ర విద్యార్థుల నాడి ఆ రాష్ట్రానికి తెలుస్తుంది అని భట్టి అన్నారు.ద

## మొద్దు నిద్రవీడి కృష్ణా జలాల దోపిడీని అడ్డుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది. ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది. ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు. యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు ఏసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, దిల్లీలో ధర్నా చేద్దాం.. మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు

## కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు 2నెలలు పొడిగింపు

**హైదరాబాద్, 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న విచారణ కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జరుగుతున్న విచారణ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరో 2 నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 30వ తేదీ వరకు కమిషన్ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ను ఏర్పాటు చేయగా ఏప్రిల్ నుంచి విచారణ పక్రియ ప్రారంభించింది.ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలతో పాటు చీఫ్ ఇంజనీర్లు, ఎస్‌ఈలకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్.. ఇక నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లను విచారించి బ్యారేజీల నిర్మాణంలో కీలక నిర్ణయాలు ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు సన్నద్ధమైంది.

## కరెంట్‌షాక్‌తో ముగ్గురి మృతి

**నిజామాబాద్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని బోధన్ మండలం పెగడపల్లి గ్రామ శివారులో కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పందుల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఓర్సు గంగారం, బాలమణి, కిషన్ గా గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## స్వర్ణగోపుర కుంభాభిషేకానికి సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రిలో జరుగుతున్న శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆదివారం 23న స్వర్ణగోపుర మహాకుంభాభిషేకం జరుగనుంది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శ్రీశ్రీ సుదర్శనలక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురమహా కుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి కొండాసురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో, ఆలయ అర్చకులు ఉన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రం అందించారు. ఆలయ పూజారులు సిఎం రేవంత్‌కు ఆశీర్వచనం చేశారు.

## రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు : డీఎస్పీ

**భూపాలపల్లి,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ హత్య కేసులో ఇంకా ఎవరిని కస్టడీలోకి తీసుకోలేదని చెప్పారు. 'హత్య వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టం. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశాం. రాజలింగమూర్తితో హంతకులకు భూతగాదాలు ఉన్నాయి. హత్యకు ఇతర కారణాల కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నాం'అని డీఎస్పీ వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యకు గురయ్యారు. ఈ హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసిన విషయం తెలిసిందే.

# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# బిఆర్ఎస్ అండతోనే ఎపి జలదోపిడీ



**హైదరాబాద్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమిషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వే లకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించు కోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజూ 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచిపెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాడన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. మేడిగడ్డ కూలితే ఒక్క పిల్లరే కూలిందని వాదిస్తున్నారు. వాళ్లే కట్టారు..వాళ్లే దోచుకున్నారు..వాళ్లే కూలగొట్టారు. కాళేశ్వరం అప్పులు తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ భారమే. పాలమూరుకు వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నిల్లివ్వలే. నీళ్ల కోసం కాదు బీఆర్ఎస్ నేతలు జేబులు నింపేందుకు కట్టారు. కృష్ణా నీళ్లలో ఏపీ దోపిడిని కేంద్రానికి వివరించాం.. కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. ఏపీ నీళ్ల దోపడిలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ అన్నారు.

### వాటా మేరకే నీటిని వాడుకుంటున్నాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి పాల్పడుతోందంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. కృష్ణా నదిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిక నీటిని వాడుకుంటుందన్న తెలంగాణ నేతల వాదనలో ఎటువంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన వాటా మేరకే నీటిని వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గోదావరి నదిలో మిగులు జలాలు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలో కలిసే నీటిని మాత్రమే అదనంగా వాడుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో మాత్రం కొంత సమస్య ఉందని, దీనికి సత్వర పరిష్కారం కనుగొనవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## కెసిఆర్ చెప్పినంత మాత్రాన కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. రైతులకు రుణమాఫీ సహా పలు కీలక హామీలను అమలు చేసినట్లు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో, కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిపోతు ందనే వాదన నమ్మశక్యం కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ గ్రాఫ్ పూర్తిగా కిందపడిపోయి, ఫామ్ హౌజ్‌కే పరిమితం అయిపోయిందని వ్యాఖ్యానిం చారు. 'నీ అల్లుడు, బిడ్డ హరీష్ రావు, కవితలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే మీ పార్టీ పరిస్థితిని అర్థమయ్యేలా చేస్తుంది' అంటూ కేసీఆర్‌కు చురకలంటించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అదృశ్యం అవుతుందని,ఆ పార్టీలో తండ్రి, కొడుకు మాత్రమే మిగిలిపోతారని గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

(మొదటి పేజీ తరువాయి)

గుప్తాను పార్టీ ఎంపిక చేసింది. దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం.2015లో దిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో దిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. భాజపా పాలిస్తున్న 14 రాష్ట్రాల్లో ఎక్కడా మహిళా ముఖ్యమంత్రి లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం రేఖాగుప్తా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

## అన్నివర్గాలను మోసం చేసిన రేవంత్: కిషన్ రెడ్డి




**యాదాద్రి,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. గురువారం యాదాద్రిలో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్నివర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు నాటకాలాడుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 స్థానాల్లోనూ బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల్లోనూ వ్యతిరేకత ఉందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,20 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. భారాస ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ ఛైర్మన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.



## ప్రజాస్వామ్య పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యత ఎన్నికల ఫలితాలను శాసించాలి

● న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన సలహాదారులు కొమ్మినేని భూపాల్ రావు పటేల్



**వరంగల్,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా కేంద్రం లో సామాజిక న్యాయ దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాల్ రావు పటేల్ మాట్లాడుతూ బీసీ లకు న్యాయం జరుగడం లేదని గగ్గోలు పెట్టినా అరిచి గోల పెట్టినా సామాజిక న్యాయం జరుగదనీ ఆయన అన్నారు. భిక్షం ఎత్తుకుంటే రావు మన హక్కులు పోరాడి సాధించుకోవాలి స్వాతంత్ర సంగ్రామం కాని తెలంగాణ ఉద్యమం కాని ప్రజా చైతన్యం తో సాదించుకున్నవే బీసీలు ఎస్సీ ఎస్టీమైనార్టీ ప్రజలతో మమేకమై రాజ్యాధికారం కోసం నిరంతరం హక్కుల కోసం ఉద్యమం చేయాలి ఏ పోరాటమైన శాతి యుతంగా రాలేదు తెలంగాణ పోరాటం లో రక్తం చిందించినది దళిత బహుజన వర్గాలే ప్రతిఫలం అగ్ర కులాలకు దక్కినది రాష్ట్రమైతే వచ్చినది ఇప్పుడు మెజారిటీ ప్రజలు ఐక్యత తో కలిసి పోరాడాలి ఓటుకు నోటుకు అమ్ముడు పోకుండా చూడాలి అంబేద్కర్ కోరుకున్న మెజారిటీ ప్రజలకు రాజ్యం వస్తుంది సామాజిక న్యాయం వెల్లి విరుస్తుంది కూడు గుడ్డ గూడు లేని పేద ప్రజలకు.విద్యా వైద్యం అందని నిరు పేదలకు సమాన అవకాశాలు వస్తాయి అగ్రకులాలు బహుజ నులకు బానిసలు గా మారే రోజు వస్తుంది తమిళ నాడు బీహార్ ఉత్తరప్రదేశ్ లలో కర్ణాటక లాంటి రాష్ట్రాలలో దళిత బహుజనులే రాజ్యాధికారాన్ని శాసిస్తున్న సంగతి ప్రజలు గుర్తుంచు కోవాలి అని భోపాల్ రావు పటేల్ తెలిపారు.

## మాదిగ జాతి ముద్దుబిడ్డ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

● పద్మశ్రీ మందకృష్ణ మాదిగను

### సన్మానించిన షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి నేతలు



**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**నిరంతరం మాదిగ జాతి కోసం, వారి హక్కుల కోసం నిరంతరం తపించి, 30 సంవత్సరాలు ఎస్సీలను వర్గీకరించి మాదిగల కు న్యాయం చేసే విధంగా ముందుకు తీసుకెళ్లి, సాధించిన పోరాట యోధుడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మన అన్న మందకృష్ణ మాదిగ అని వారు కొనియాడారు. అణగారిన వర్గాల కోసం నిరంతరం పరి తపించే మందకృష్ణ వృద్ధులకు వితంతువులకు పెన్షన్ పెంచుటలో, పేదలకు చౌక బియ్యం ఒక్కొక్కరికి ఆరు కిలోలు పెంచుటలో.. వికలాంగులకు పెన్షన్ ఇప్పించుటలో.. ఆరోగ్యశ్రీ పథకాన్ని పెట్టడానికి ప్రభుత్వానికి సూచించి మార్గదర్శకుడయ్యారన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం" పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని, గురువారం హైదరాబాదులోని సెంట్రల్ కోర్టు హోటల్ నందు కలిసి షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ,రాష్ట్ర కమిటీ నాయకులు, జాతీయ ఉపాధ్యక్షులు చిన్నపెల్లి కొమురయ్య, జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాడపాక పరంజ్యోతి, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎర్ర చంద్రమౌళి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గుర్రపు యాదగిరి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సోమవారపు వీరస్వామి, హనుమకొండ జిల్లా నాయకులు బట్టు దామోదర్, తదితరులు మంద కృష్ణ మాదిగ ని కలిసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ పై సవివరంగా చర్చించారు.

## పార్టీ జెండాను భుజ స్కందాలపై మోసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

● 63వ డివిజన్, కాంగ్రెస్ మాజీ టి- పిసిసి కార్యదర్శి సయ్యద్ రజాలి



**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**పది సంవత్సరాలు అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ జెండాను వీడకుండా ఎన్నో కేసులు పెట్టిన అదరకుండా బెదిరకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను మొదటి నుండి భుజ స్కందాలపై మోసిన కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి, రాబోయే నామినేట్ పోస్టుల్లో తగిన స్థానం కల్పించాలని అని 63వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ రజాలి ఒక ప్రకటనలో అధిష్టానాన్ని కోరారు. ఒక దిక్కు కాంగ్రెస్ అధిష్టానం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గే ఇతర పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహించదు అని, ముందుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు నాయకులకు తగిన న్యాయం చేయాలని సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరి న్యాయం ఎక్కడ జరుగుతోందని, ఎవరికి జరుగుతుందని అధిష్టానం కార్యకర్తలకు సమాధానం ఇచ్చే అవసరం ఎంతైనా ఉందని ప్రశ్నించారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విమర్శించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, మంత్రిగా కొనసాగుతున్న వరంగల్ లో వారే పదవులు అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధిష్టానం గుర్తించాలని, అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొండా సురేఖ ఓటమికి అప్పటి బిఆర్ఎస్ నేతలు చేయని ప్రయత్నం లేదని విమర్శించారు. 2021 GWMC ఎన్నికలలో 66 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ కేవలం నాలుగు సీట్లు మాత్రమే గెలవడం జరిగిందని, అందులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి 10వ డివిజన్ నుండి తోట వెంకన్న, 5వ డివిజన్ నుండి పోతుల శ్రీమన్, 62వ డివిజన్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ నుండి విజయ్ శ్రీ సయ్యద్ రజాలి తో కలిసి నాలుగు సీట్లు మాత్రమే గెలుపొందిన విషయాన్ని అధిష్టానానికి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా మాకు సరైన న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని జిల్లా మంత్రులను శాసనసభ్యులను ఎమ్మెల్సీలను స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ లను ఇతర కాంగ్రెస్ పెద్దలందరికీ వేడుకుంటున్నామని, దయచేసి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని త్వరగా పరిశీలించి తగు న్యాయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు న్యాయం చేస్తారని మనవి చేస్తూ.. సదా కాంగ్రెస్ పార్టీ సేవకై పరితపించే మాజీ టి పి సి సి కార్యదర్శి సయ్యద్ రజాలి అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో షెడ్యూల్ కులాల వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

● షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్





**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** షెడ్యూల్ కులాల హక్కుల వాటగా.. రాష్ట్ర ప్రభుత్వం కాబోయే నామినేట్ పదవులలో షెడ్యూల్ కులాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్ అన్నారు. గురువారం షెడ్యూల్ కులాల నేతలు, పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ రాజకీయ వ్యవహారాల ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ రాష్ట్ర నాయకులు కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో షెడ్యూల్ కులాల హక్కుల కాపాడుటకు ప్రభుత్వంలోని నామినేటెడ్ పదవులలో షెడ్యూల్డ్ కులాల వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, షెడ్యూల్ కులాల హక్కులను పరిరక్షించాలని ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు చిన్న పెల్లి కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రడపాక పరంజ్యోతి, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎర్ర చంద్రమౌళి, మహబూబాబాద్ అధ్యక్షులు సోమారపు వీరస్వామి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గుర్రపు యాదగిరి, హనుమకొండ జిల్లా నాయకులు బట్టు సమోదర్ పాల్గొన్నారు.

## ప్రాక్టీసింగ్ విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించిన నార్కోటిక్స్ సిఐ రవీందర్




**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం హన్మకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్ లో ఉదయం ప్రార్ధన సమయం లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1000 మంది విద్యార్థులు ప్రార్థనలో పాల్గొనగా ధూమపానం, మద్యం, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వరంగల్ నార్కోటిక్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వింగ్ ఇన్ స్పెక్టర్ బి.రవీందర్, సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ ఐ) సాయిలు, ఇతర సిబ్బంది విద్యార్థులకు ప్రాక్టికల్ గా కసరత్తులు చేసి చూపించారు. 'నో స్మోకింగ్, నో ఆల్కహాల్, నో డ్రగ్స్' అంటూ నినాదాలు చేశారు. సిఐ రవీందర్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో డ్రగ్స్ పొగతాగడం లేదా పాఠశాల ఆవరణలో అక్రమంగా గంజాయి అమ్మడం వంటివి జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. గంజాయి అక్రమ విక్రయాలపై విద్యార్థులు పోలీసులకు లేదా పాఠశాల సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.అలాంటివారి పై మేము పిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఎటువంటి పరిస్థితుల్లోనైనా వారిని అదుపులోకి తీసుకుంటాము అని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను, పాఠశాల విద్యార్థులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచాలి. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోందని రవీందర్ అన్నారు. వరంగల్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ దాని కోసం కృషి చేస్తోందని అదేవిధంగా, మాదక ద్రవ్యాల వాడకాన్ని నివారించేందుకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మేము కింది స్థాయి నుండి అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లను ప్రభుత్వ ప్రాక్టీస్ హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ జగన్నాథం, చిన్నారులు విడుదల చేశారు. పోస్టర్లు గోడలపై ప్రదర్శించాలని ఇది పిల్లలకు సహాయం చేస్తుందని అన్నారు.

## ఎన్ఐటిలో 2025 ఫిబ్రవరి 28, 2025 నుండి మార్చి 2, 2025 వరకు స్ప్రింగ్ స్ప్రీ

● ముఖ్య అతిథిగా హాజరు కానున్న పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మనందం



**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఎన్ఐటి వరంగల్ ప్రతిష్టాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవమైన స్ప్రింగ్‌స్ప్రీ 2025-కు ముస్తాబవుతోంది. సంగీతం, నృత్యం, కళలు, వినోదం వంటి రంగాల్లో ప్రతిభను వెలికి తీయడానికి వేదికగా స్ప్రింగ్‌స్ప్రీ దక్షిణ భారతదేశంలోని ప్రముఖ కళాశాలల వార్షికోత్సవాల్లో ఒకటిగా పేరుగాంచింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, కళాకారులు, ప్రదర్శకులు పెద్ద ఎత్తున ఈ మహోత్సవానికి హాజరవుతారు.పోటీలు, వర్క్‌షాపులు, ప్రో-షోలు లాంటి విభిన్న కార్యాక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేయనున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, సాహసక్రీడలు, సంగీత విభావరి వంటి అనేక కార్యక్రమాలతో స్ప్రింగ్‌స్ప్రీ 2025 యువతలోని ప్రతిభను, సృజనాత్మకతను ప్రోత్సహించనుంది.ఈ వేడుకలకు మరింత ఉత్సాహాన్ని కలిపేందుకు పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. తన అమోఘమైన హాస్యంతో కోట్లాదిమంది హృదయాలను గెలుచుకున్న బ్రహ్మానందం స్ప్రింగ్‌స్ప్రీ 2025 వేదికపై సందడి చేయనున్నారు.

## కొరవి వీరన్నను దర్శించుకున్న హీరో గోపీచంద్



**మహబూబాబాద్, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో హీరో గోపీచంద్ పర్యటించారు. వరంగల్ ఎన్ఐటి ప్రతిష్టాత్మక వార్షిక సంస్కృతిక మహోత్సవం కార్యక్రమానికి వచ్చిన ఆయన ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొరివి వీరభద్రుణ్ణి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను హీరో గోపిచంద్ కు ఇచ్చారు. వీరభద్రుడి విశిష్టత గురించి ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ, దర్మకర్త చిన్నం గణేష్ లు వివరించారు. శివరాత్రి రోజున భద్రకాళి సమేత వీరభద్రుడి తిరుకల్యాణానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పులి సర్వోత్తమ్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

● బిజెపి పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్



**పరకాల, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పరకాల బిజెపి పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ అన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ అధ్యక్షతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుటకుగాను పట్టణ ఓటర్స్ సంపర్కు సమావేశము బూత్ ప్రభారీ, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల రాజవీరు కుక్కల విజయకుమార్ దగ్గు విజేందర్ రావు, బెజ్జంకి పూర్ణ చారి, కొలనుపాక భద్రయ్య, మార్త బిక్షపతి, బాసాని సోమరాజు, సంఘ పురుషోత్త,బండి రవి, మారేడుగోండ భాస్కరాచారి, వేముల సదారాణి, సారంగ నరేష్ పాల్గొన్నారు.

## లచ్చమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేష్ తల్లిగారైన ముదురుకోళ్ల లచ్చమ్మ అనారోగ్యంతో హనుమకొండ లోని ఏకశిలా (మాక్స్ కేర్)ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లచ్చమ్మను గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావుతో పాటు తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో కలకలం

- ఏసీబీకి పట్టుబడ్డ ల్యాండ్ సర్వేయర్

**మంథని, ఫిబ్రవరి 20 (పీసిడబ్ల్యూ న్యూస్):**మంథని రెవెన్యూ కార్యాలయంలో ఏసీబీ దాడులతో కలకలం రేగింది. భూమి సర్వే రిపోర్ట్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన ల్యాండ్ సర్వేయర్ రెడ్ హ్యాండెడ్ గా గురువారం రాత్రి ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డిఎస్పి వివి రమణమూర్తి కథనం ప్రకారం మంథని మండలం రెవెన్యూ సర్వేర్ గా పని చేస్తున్న జాటోతు గణేష్ మంథని రెవెన్యూ గ్రామ శివారులోని రెడ్డి చెరువు వద్ద సర్వేనెంబర్ 814 /డి /1, 815/సి సర్వే నెంబర్ల ఒక ఎకరం భూమిని కొలిచేందుకు రైతు సువర్ణ క్రాంతి దగ్గర రూ.17వేల డిమాండ్ చేశారు. ఈనెల 5న తొమ్మిది వేల రూపాయలు తీసుకున్నాడు. మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో రైతు ఏసీబీ ని ఆశ్రయించాడు. మరో మూడు వేలు రెండవ వాయిదాగా గురువారం ఇస్తానని ఫోన్ చేయగా సర్వేయర్ ఆఫీసుకు కాకుండా బస్టాండ్ కు రమ్మని బాధితునికి చెప్పాడు దీంతో బాధితుడు రూ. 3000 బస్టాండ్ లో సర్వేయర్ గణేష్ కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మంథని పట్టణంలో చాలా రోజుల తర్వాత ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో ఉద్యోగుల్లో ఒకసారిగా కలకలం రేగింది. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు తిరుపతి కృష్ణ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుల్ శ్రీకాంత్, హోంగార్డులు అశోక్, సంతోష్ లు ఉన్నారు.





# వోక్స్ వ్యాగన్ వర్శిటీ ప్రొఫెసర్ ఆత్మహత్య

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా కంకోల్‌లో గల వోక్స్ వ్యాగాన్ యూనివర్శిటీలో ఆర్ట్స్ అండ్ డిసైజన్ విభాగములో ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తిస్తున్న సుమంత్ కుమార్ (36) ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలు ఆయినా కూడా సుమంత్ విధులకు హాజరు కాలేదు దీంతో తోటి సిబ్బంది రూమ్ కి వెళ్ళి చూడగా ఫాన్ కు వేలాడుతూ కనిపించాడు. సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ ఐ రాజేష్ నాయక్ బృందం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు అనంతరం డెడ్ బాడిని సదాశివ పేట్ ప్రభుత్వ హాస్పటల్ కి తరలించారు. మృతుడి స్వస్థల ఝూర?ండ్ కి ఫోన్ చేసి వారి తలితండ్రులకు సమాచారమ్ అందించారు.

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతుగా ప్రచారం





**గంగాధర,ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారి ఆదేశాల మేరకు ఈరోజు గంగాధర మండలంలోని ఉప్పర మల్యాల మరియు వెంకంపల్లి గ్రామాలలో పట్టభద్రుల ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గంగాధర మండల కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దమ్మ జాతరలో చల్మెడ...





**వేములవాడ,ఫిబ్రవరి20(పీసీడబ్ల్యూ న్యూస్):**కోనరావుపేట్ మండలం కొలనూర్ గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెదమ్మ జాతర మహెూత్సవానికి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య,సింగిల్ విండో ఛైర్మన్ రామ్మోహన్ రావు,సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి మండల అధ్యక్షుడు దేవయ్య, ముఖ్య నాయకులు సతీష్ గౌడ్,అరవింద్,మహేష్, సంపత్,బాబు తదితరులు ఉన్నారు.

# కల్వచెర్ల బోక్కలవాగులో ప్రమాదవశాత్తు పడి సింగరేణి కార్మికుడు మృతి

**రామగిరి,ఫిబ్రవరి20(పీసీడబ్ల్యూ న్యూస్):** రామగిరి మండలం కల్వచర్ల బొక్కల వాగులో పడి సింగరేణి కార్మికు మృతి చెందాడు. గురువారం ఉదయం సింగరేణి ఉద్యోగి ఊరగొండ రాజు కుమార్(42) రాంపెల్లిలోని బంధు వుల వివాహ వేడుకలలో పాల్గోని పెద్దపల్లి వైపు నుండి సెంటినరి కాలనికి వచ్చే క్రమములో మోటార్ సైకిల్ తో బ్రిడ్జి పై నుండి వాగులో పడి మృతి చెందడు.మృతునిది రామగిరి మండలం లద్నాపూర్ గ్రామము,మృతునికి బార్య ఇద్దరు పిల్లలు ఉండగా మృతుడు ఆర్.జి త్రి ఎ.ఎల్.పి గనిలో అసిస్టెంట్ పోర్మెన్ గా పనిచేస్తున్న ట్లు తెలిసింది.రాజుకుమార్ మృతితో గ్రామములో విషాద చాయలు అలుముకున్నాయి. రామగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమెదు చేసి విచారణ చేస్తున్నారు.

# తల్లిదండ్రులపట్ల విద్యార్థులు పూజనీయ భావం కలిగిఉండాలి

● ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్

● శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్




**ఖమ్మం, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** విద్యార్థులలో తల్లిదండ్రులపట్ల గౌరవంతో పాటు పూజనీయ భావం కలిగి ఉండాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్ అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గల శ్రీచైతన్య టెక్నో స్కూల్ లో గురువారం ఫ్యామిలీ ఫెస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రులను ఉచితాసనం మీద కూర్చోబెట్టి వారి కాళ్లు కడిగి, వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. విద్యార్థులు చిన్న చిన్న బహుమతులు తెచ్చి వారి అమ్మానాన్నలకి ఇవ్వడం జరిగింది. ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్ మాట్లాడుతూ... సమాజంలో ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, ఇప్పుడు చిన్న కుటుంబాలుగా ఏర్పడి ఉరుకుల పరుగుల జీవితంలో మానవతా విలువలు, కుటుంబ అనుబంధాలు తగ్గిపోతున్నాయని, తల్లిదండ్రుల పట్ల విద్యార్థులు పూజనీయ భావం కలిగి ఉండాలని, విద్యార్థులకు తల్లిదండ్రుల విలువలు తెలియాలని ఇటువంటి ఫ్యామిలీ ఫెస్ట్ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఊహించిన దాని కంటే ఊహించని విధంగా తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం తమకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, వైస్ ప్రిన్సిపాల్ నివేదిత, డీన్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

● మాదక ద్రవ్యాల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**మహబూబాబాద్, ఫిబ్రవరి.20(పి. సి. డబ్ల్యూ న్యూస్):** జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారీ లతో కలిసి సంబంధింత అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్‌కార్డ్)సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పోలీసశాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థులకు, వీటిపై అవగాహనా కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ప్రార్థన సమయాలలో పలు సందేశాలతో అవగాహన కల్పించాలని, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పట్టణ మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణాలో ఉందని, వాటిపై పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా పెట్టి నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ఇతర శాఖలనుండి కూడా సహకారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా ఉత్పత్తి చేయడం చట్టవ్యతిరేకమైన చర్య అని, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ మాదకద్రవ్యాల సరఫరా ఎక్కువగా ఉన్నదని అటువంటి ప్రాంతాల్లో పోలీసు శాఖ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని, ఇట్టి చర్యలకు పాల్పడిన వారు కఠినంగా శిక్షించ బడుతారని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా యువతీ, యువకులు ఈ మాదకద్రవ్యాల బానిసై తమ ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు. అదే విధంగా గంజాయికి బానిసైన వారి కోసం మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వినయోగం ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో,కాలేజీల్లో మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవో లు కృష్ణవేణి, గణేష్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉమారాణి, జిల్లా టి.బి. కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ట్రైబల్ వేల్ఫేర్ డి.డి దేశీరాం, డి.ఐ.ఈ.ఓ మాదార్ ,బి.సి డెవెలప్మెంట్ అధికారి నరసింహస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లీల, విద్యశాఖ అధికారి శ్రీరాములు సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం...





**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం రోజు కాంగ్రెస్ పార్టీ సిటీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ అబ్దుల్ బారి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి నగరంలోని హుస్సేనిపురా, 27 వ డివిజన్ లోని ఎన్ఎస్ స్కూల్, మరియు ఇంటి ఇంటి కు వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. నేరుగా పట్టబద్రులు, ఉపాధ్యాయులను కలిసి కాంగ్రెస్ పార్టీ చేసిన రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడు మీ మద్దతు ఉండాలని కోరారు. పట్టబద్రుల నుండి కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి కు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సంధర్బంగా మొహమ్మద్ అబ్దుల్ బారి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లోనే పట్టబద్రుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ కి మీ మద్దతు ప్రకటించి మీ ఓటుతో వి.నరేందర్ రెడ్డిని గెలిపించాలని అన్ని వర్గాల ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి... సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. మీ అందరి మద్దతు కూడ కాంగ్రెస్ పార్టీ కి ఎల్లప్పుడు ఉండాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సిరాజుద్దిన్, బషీర్, షకీల్, ఖలీల్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు మలబార్ గోల్డ్ స్కాలర్షిప్ చెక్కుల పంపిణీ





**గంగాధర, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గంగాధర్ లో మలబార్ గోల్డ్ స్కాలర్షిప్ వారి సౌజన్యంతో 20 మంది బాలికలకు రూ "లు 1,62,000 ల విలువైన చెక్కులను గౌరవ డిఐఈ ఓ జగన్మోహన్ రెడ్డి , ఎంపీడీవో దమ్ముని రాము , కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయ మరియు మలబార్ గోల్డ్ ట్రస్ట్ టీం ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది.చెక్కుల పంపిణీ అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రియమైన విద్యార్థిని, విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని, దేశ వ్యాప్తంగా బాలికలకు ,మహిళా సాధికారతకు మలబారు గోల్డ్ వారి సహకారం ఎంతో ఉందని, భవిష్యత్తు కాలంలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పేద, మధ్య తరగతి అమ్మాయిలకు మలబార్ గోల్డ్ వారి సహకారం ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహంతో విద్యార్థినులు మరింత ఉత్సాహంతో అన్ని రంగాలలో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్. ఎస్.ఎస్.పి.వో. ఎల్. సురేష్, ఏజీఎంసి పి. గోపాల్, జె.ఇందూర, పి. ఇందిరా, రాజు, రాజమహేందర్ రెడ్డి, మహేశ్వర్, రాధాకృష్ణ ,రాజు, దీపారాణి, మల బార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు విక్కీ , శ్రీనివాస్ కళాశాల ఆఫీసు సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రులం ఒక్కటవుదాం.. క్రమ సంఖ్య ఒకటికి ఓటేద్దాం.

● రేపటి తరం చిరునవ్వులు చూడాలనేదే నా లక్ష్యం. వారి భవితకు బలమైన పునాది వేసేందుకు సిద్ధం ● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ సంధర్భంగా అంజి రెడ్డి వివిధ కార్యక్రమాలలో పాల్గొని ప్రసంగించారు.తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు భారంగా మారిన అధిక ఫీజులపై గలమెత్తిన బిజెపికి అండగా నిలుస్తారని ఆశిస్తున్నాను.ఇవాళ సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేట్ మరియు ఉపాధ్యాయల సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, వట్పల్లి మండల బీజేపీ అధ్యక్షుడు అశోక్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఇవాళ కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్, కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# గర్భిణీ స్త్రీలకు ఆవాహన సదస్సు

● దళారులను నమ్మి మోసపోవద్దు..

● ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాధవ్



**గార్ల, ఫిబ్రవరి 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ అసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం , శ్రేయస్కరం మరియు తల్లి బిడ్డలకు ఆరోగ్యకరమని డాక్టర్ రాజ్ కుమార్ యాదవ్ అన్నారు. గార్ల మండల కేంద్రంలో గర్భిణీ స్త్రీల అవగాహన సదస్సు నువ్వు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లి గర్భం దాల్చిన నాటి నుండి బిడ్డను ప్రసవించే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలనీ,పౌష్టిక ఆహారంతో పాటు వ్యామాలు, యోగ చేయటం ఏంతో అవసరమని అన్నారు. వైద్యుల సలహా లేకుండా ఏటువంటి అనవసరమైన మందులు వేసుకోరాదన్నారు. రేడియేషన్,ఎక్స్ రే లకు దురంగా ఉండాలనీ, పుట్టే బిడ్డలు అంగవైఖల్యంతో పుట్టకుండా డాక్టర్ సలహాలను పాటించాలని, వైద్యుల సలహాతో మాత్రమే మందులను వాడాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల సూచన మేరకు వైద్య పరీక్షలు చేసుకుంటు సూచనల పాటించాలన్నారు. ప్రభుత్వ ప్రజా ఆస్పత్రిలోనే ప్రసవాలు జరుపుకోవటం మేలని ఈ మధ్యకాలంలో దళారుల వల్ల వచ్చే కమిషన్ కి ఇష్టపడి కొందరు గర్భిణీలు ఇబ్బందులు పడుతున్నట్టు సమాచారం వచ్చిన క్రమంలో తల్లి బిడ్డ క్షణం కోసం ప్రభుత్వ ఆసుపత్రులు ను ఆశ్రయించడమే మంచిదని మేధావి వర్గం చెప్తుందని కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రులను నమ్మాలని వైద్యపరంగా అందించాల్సిన అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ విజయ లక్ష్మీ , నర్సింగ్ అఫీసర్ లు వినోద, శోభ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దామోదర రాజనర్సింహని కలిసిన షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి రాష్ట్ర, జాతీయ నాయకులు

**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాదులో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని, గురువారం షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ, రాష్ట్ర,జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో ఉన్న షెడ్యూల్ కులాల హక్కుల గురించి జనాభా ప్రాతిపదికన ఏబిసిడి వర్గీకరణ చేయాలని, రానున్న నామినేటెడ్ పదవులను షెడ్యూల్ కులాల వారికి అధికంగా కేటాయించే విధంగా చూడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు చిన్న పెల్లి కొమురయ్య, జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రడపాక పరంజ్యోతి ,రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎర్ర చంద్రమౌళి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సోమారపు వీరస్వామి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గుర్రపు యాదగిరి, జిల్లా నాయకులు బట్టు సమోదర్ తదితరులు కలిసి జిల్లా సమస్యలపై, ఏబిసిడి వర్గీకరణ తదితర అంశాలను మంత్రితో చర్చించారు.



# పవిత్ర రంజాన్ మాసంలో ప్రభుత్వం ద్వారా మౌళిక సౌకర్యాలు కల్పించండి

- ఇఫ్తార్ వేళల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నుంచి, ట్రాఫిక్ చాలన్లను మినహాయించండి
- ఫుట్ పాత్, చిరు వ్యాపారులు, హోటళ్లు, హారీస్ స్టాల్స్, కిరాణా షాపులు, ఫ్రూట్స్, కూరగాయల షాపులకు మినహాయింపు కల్పించండి
- జిల్లా కలెక్టర్‌కు, ఏసీపీకు, మున్సిపల్ కమిషనర్‌కు, విద్యుత్ ఎస్ఈకి ఎంఐఎం నేతల వినతి పత్రం..





**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** మార్చి 2వ తేదీ నంచి పవిత్రమైన రమజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగరంలోని అన్ని మస్జిదుల వద్ద, ముస్లిం కాలనీల్లో అధికారులు చేయాల్సినటువంటి ఏర్పాట్లపై కరీంనగర్ ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, టౌన్ ఏసీపీకి, నగరపాలక సంస్థ కమిషనర్ కు జిల్లా ట్రాన్స్కో ఎన్పీడీసీఎల్ ఎస్ఈలకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. రంజాన్ పండగ ఏర్పాట్లకు ప్రభుత్వం ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రంజాన్ నెలలో నగరంలో ముస్లిం కాలనీల్లో, మస్జిద్ లలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదుల వద్ద నీటి ట్యాంకర్ల ఏర్పాటు చేయడంతో పాటు, నగరంలో నీటి ట్యాంకర్ల కొరత లేకుండా చూడాలని సూచించారు. నగరంలో మసీదుల వద్ద అదనపు క్లీనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా అపరిశుభ్ర వాతావరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైనేజి లను శుభ్రపరచాలని, మస్జిద్ లలో పనిచేస్తున్న ఇమామ్ లకు ,మౌజన్ లకు జీతాలు రిలీజ్ చేయాలన్నారు. రంజాన్ నెల కోసం కరీంనగర్లో ఏర్పాటు చేసిన విధంగా అన్ని మున్సిపల్ ఏరియాలో గ్రామాలలో ఏర్పాటు చేయాలని కోరారు. దింతో పాటు నగరంలో కిరాణా షాపులు, ఫ్రూట్స్, కూరగాయలు, హోటల్స్, హారీస్ స్టాల్స్ లకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని , పుట్ పాత్ ల వద్ద అమ్ముకునే చిరు వ్యాపారులను పోలీసులు ఇబ్బందులు పెట్టకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ కు.. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కు నగరపాలక సంస్థ కమిషనర్కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. వేసవికాలం దృష్ట్యా రంజాన్ నెలలో నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అదనపు లోడ్ పడినపుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రీట్ లైట్స్ ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు మసీదుల వద్ద లైటింగ్ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.. చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేపట్టాలని చెత్త సేకరణ ఆటోలు పూర్తిగా అన్ని కాలనీలో తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, ఏసీపీ లు మాట్లాడుతూ రంజాన్ నెలను ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవాలని సూచించారు. మసీదుల వద్ద శామియానాలు, వాటర్ ఫెసిలిటీ, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. రంజాన్ నెలకు సంబంధించి ఏర్పాట్లపై త్వరలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. అన్ని కాలనిల్లో తాగునీటికి ఎక్కడ ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. మంచినీటి ట్యాంకర్లు అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు..ఓవర్ లోడ్ పడినప్పుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ఫార్మర్లు అదనంగా ఉంచడంతో పాటు మొబైల్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.. అదనపు శానిటేషన్ టీమ్స్ ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కి సూచించారు.. ఎంఐఎం నేతలు కోరిన విధంగా రంజాన్ మాసం సందర్భంగా షాపులు 24 గంటలు నడుపుకోవడాన్ని పరిశీలించాలన్నారు.. పుట్ పాత్ లపై ఉండే చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రంజాన్ నెలలో ఇఫ్తార్ తో పాటు సహార్ సమయాల్లో తనిఖిల పేరుతొ, చాలన్ల పేరుతో ఇబ్బందులు కలిగించద్దని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని టౌన్ ఏసీపీకి కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు ఖమరుద్దీన్, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలీబాబా, అజర్ దబీర్, వివిధ డివిజన్ల అధ్యక్షులు సాజిద్, అబ్దుల్లా ఆసిమ్, మాజీ కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే!

- కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి
- షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టబద్ధత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి
- మన ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమే
- స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి






**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. గురువారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సాగు నీటి సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ లోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాఎగరాలని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నదని తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42% రిజర్వేషన్లు కల్పించడంతోపాటు చట్టబద్ధత కల్పించడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వాదేనని వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి వారి నిబద్ధత చాటుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం, ఏ రాజకీయ పార్టీ చేయని సాహసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని పోవడంలో కొంత వెనుకబడి ఉన్నామని అన్నారు. ఈ మధ్యకాలంలో పార్టీలో ఉండి, ప్రభుత్వంలో ఉండి.. పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఫ్యాషన్ అయిపోయింది అని తెలిపారు. అలా మాట్లాడడం పార్టీకి గాని, మనకు గాని ఎంత మాత్రం మంచిది కాదని సూచించారు. అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ, పదవులను, పథకాలను అమ్ముకున్న వారు ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుతున్నారని, అలాంటి వారు చేసే దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని యువజన, సోషల్ మీడియా నాయకులకు సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంతో పాటు కొంతమంది పనికిమాలిన వారు చేసే దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టే విధంగా సోషల్ మీడియా నాయకులు పనిచేయాలని తెలిపారు. మార్చి 15వ తేదీ లోపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన సుమారు రూ. 1000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, సుమారు 50 వేల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అందుకోసం ఇప్పటినుండే మండల స్థాయి నాయకులు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని అందుకు అనుగుణంగా పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. పార్టీని, ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. అందుకు కొత్త, పాత అనే తేడా లేకుండా అందర్నీ కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తూ కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మన అందరి ఏకైక ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని, ఇందులో ఎలాంటి భేషజాలు, భేదాభిప్రాయాలు లేకుండా అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. త్వరలోనే యూత్ కాంగ్రెస్ నాయకులతో, మహిళా కాంగ్రెస్ నాయకులతో, సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆగని ప్రయివేట్ చిట్ ఫండ్ మోసాలు

- డబ్బులు అడిగితే చంపుతామని బెదిరింపులు



**మహబూబాబాద్,ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలో చిట్ ఫండ్ సంస్థ ల మోసాలు ఆగడంలేదు.అవసరానికి ఉపయోగపడుతాయని ప్రైవేట్ చిట్ ఫండ్ లో పొదుపు చేసిన కస్టమర్ లను నిర్వాహకులు మోసం చేస్తున్నారు.చిట్టీ గడువు ముగిసినా డబ్బులు చెల్లించక పోవడంతో పాటు చెల్లని చెక్ ఇచ్చి మోసం చేస్తున్నారు. డబ్బులు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు. భయాందోళనకు గురౌతున్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీల మోసాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి.పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా చిట్ ఫండ్ కంపెనీలు చీటింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో 20 పైగా ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీలు ఉంటే అందులో పది కూడా సక్రమంగా ప్రజలకు సేవలు అందించడం లేదంటే ఏ స్థాయిలో మోసాలు జరుగుతున్నాయే అర్థం చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.జిల్లాలో విస్తరించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన పలు ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీల ఛైర్మన్లు, డైరెక్టర్ లు మేనేజర్ లపై కేసులు నమోదు అవుతూనే ఉన్నా మోసాలను అరికట్టడంలో విఫలమవుతున్నారు.చిట్టి కట్టించుకునే క్రమంలో కస్టమర్ల దగ్గర నుండి గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఖాళీ చెక్కులు,శాలరీ పే స్లీప్స్,ఆధార్ కార్డు లాంటి ప్రూఫ్స్ దగ్గర పెట్టుకుని చిట్టి పాట పడిన తర్వాత డబ్బులు ఇవ్వమని అడిగితే డబ్బులు ఇవ్వకుండా చెక్ బౌన్స్ వేస్తామని బెదిరిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇలా బ్లాక్ మెయిల్ చేసే చిట్ ఫండ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, బాధిత కుటుంబాలు ప్రభుత్వ యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు.




## పిఎం ఇంటర్న్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ఎంపికైన వారికి నెలవారీ భత్యం
- పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్

**మహబూబాబాద్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇంటర్న్ షిప్ పథకం కింద నెలవారీ భత్యాన్ని అందించడానికి అర్హులైన విద్యార్థుల నుండి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు కేంద్ర కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం రెండో దశకు నోటిఫికేషన్ వెల్లడించింది. 21 నుండి 24 ఎల్ల లోపు వారు మార్చి 11 లోపు pminternship.mca.gov.inవెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.ఈ ఇంటర్న్ షిప్ కు ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు నెలకు రూ.5 వేల చొప్పున, ఒక్కసారి సాయం కింద రూ.6 వేలు అందజేస్తారు. 12 నెలల వ్యవదిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని, దరఖాస్తుదారుల కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదని ఎస్.ఎస్.సి ఇంటర్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ డిప్లమా, డిగ్రీ కలిగి ఉండి కుటంబ ఆదాయం రూ. 8 లక్షలలోపు ఉండాలని, యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇదో సువర్ణావకాశం అని పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 1800 11 6090 టోల్ ఫ్రీ నెంబర్ లో లేదా pminternship.mca,gov.inని సందర్శించాలని పేర్కొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నహాక సమావేశానికి హాజరైన మంత్రి, నాయకుడు...





**కరీంనగర్,ఫిబ్రవరి20(పీసీడబ్ల్యూ న్యూస్):** నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో నిర్వహించిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ ఎన్నికల కరీంనగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ జంగా రాఘవ రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి పాల్గొన్న ,నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ ఇంచార్జి వొడితెల ప్రణవ్ పాల్గొన్నారు.

## డైల్ యువర్ డిఎం ప్రోగ్రాంలో సలహాలు సూచనలు ఇవ్వండి

- డిపోను అభివృద్ధి చేద్దాం సుఖమైన ప్రయాణాన్ని కొనసాగిద్దాం

**తొర్రూరు ప్రతినిధి, ఫిబ్రవరి 20(పీసీడబ్ల్యు న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ లో నేడు దయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు డిపో మేనేజర్ పద్మావతి. తొర్రూర్ డిపో పరిధిలోని అన్ని రూట్ల లోని బస్సుల గురించి మరియు బస్టాండ్ లో మౌలిక సదుపాయాలు గురించి మరేదైనా ఇతర ప్రాంతాలకు బస్సులు కావలసిన ప్రస్తుతం నడుస్తున్న బస్సులలో ప్రయాణికులకు కలిగే ఇబ్బందులు వాటిపై సలహాలు సూచనలు కూడా ఇవ్వవచ్చు. ఈరోజు శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డ యల్ యువర్ డిఎం కార్యక్రమం లో పాల్గొని మీ సమస్యలకు పరిష్కార మార్గం పొందవచ్చు. ఎవరైనా సరే 9959226053 ఈ నెంబర్ కు ఫోన్ చేసి సలహాలు సూచనలు ఇవ్వండి పొందండి. ఒక ప్రకటన ద్వారా డిపో మేనేజర్ పద్మావతి ఈ విషయాలను వెల్లడించారు.





## శివాజీ మహారాజ్ సంరక్షకులు మన ముస్లిం యోధులు

**నిజాంబాద్, ఫిబ్రవరి 20 (పిసీడబ్ల్యూ న్యూస్):** బహుజన చక్రవర్తి శివాజీ మహారాజు సర్వ ధర్మాల ప్రియుడు. తన సైన్యంలో అన్ని జాతుల ధర్మాల ప్రజలకు సమాన ప్రాతినిత్యం ఇచ్చిన నిజమైన సెక్యులర్ రాజు. ఆయన తన అంగరక్షకుడిగా సిద్ది ఇబ్రహీంను నియమించుకున్నారు. చాలా ముఖ్యమైన తోఫ్ ఖానా ప్రముఖులు ఇబ్రహీం ఖాన్, తన న్యాయవాది ఖాజి హైదర్, యుద్ధానికి అగ్రభాగాన ఉండే సేనాని సిద్ది వహావహాజీ, మరో సేనాని నూర్ ఖాన్ బేగ్, ఆయుధాల గోడౌన్ ఇన్చార్జి దౌలాత్ ఖాన్ వీరి నిబద్ధత నిజాయితీతో మన ఛత్రపతి వందకు పైగా ఖిలాలను /కోటాలను గెలిచిన చారిత్రాత్మక దాఖలాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని "కెల్షి" అనే ప్రాంతంలో హజరత్ బాబా యాకూబ్ పేర దర్గాను నిర్మించిన నిజమైన సెక్యులర్ రాజే శివాజీ. వీరు మన ఛత్రపతి గారి సామ్రాజ్యాన్ని కాపడడమే కాకుండా విదేశీ మొఘల్ శత్రువుల దాడి నుంచి రక్షించిన మన ప్రియతమ ముస్లిం యోధులు. ఇంతేగాకుండా మొట్టమొదటి ఛత్రపతి గారి చిత్రం /ఫోటో రూపకల్పన చేసిన ఘనత ఆర్టిస్ట్ మీర్ మొహమ్మద్ గారే. అయితే ఇలాంటి సర్వప్రియ చక్రవర్తిని నేడు బ్రాహ్మణీయ మతోన్మాదులు "ముస్లిం ద్వేషి"గా చిత్రీకరించడం దుర్మార్గమని అంబేడ్కర్ యువజన సంఘం (ఎవైఎస్) నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఇత్వార్ పేట్ లింగన్న ఉరఫ్ డి.ఎల్ మాలజీ దుయ్యబట్టారు. ఆయనను దేశ ప్రజలు సెక్యులర్ చక్రవర్తిగా ఆదర్శంగా తీసుకొవాలని డి.ఎల్ మాలజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్మూర్ లోని ఎవైఎస్ నూతన కార్యాలయం ప్రారంభం నిమిత్తంగా ఛత్రపతి 395వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాల్కొండ నియోజక వర్గం ఇన్చార్జి జిన్నా జనార్ధన్, మోర్తాడ్ మండల్ అధ్యక్షులు అంగులి మాలజీ, భీంగల్ మండల్ అధ్యక్షులు సుద్దులం సునీల్, వడ్ల హరిప్రసాద్, వివేక్ గంగపుత్ర పాల్గొన్నారు.

## బయ్యారం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో -కబడ్డీ

**- నేటి నుండి ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం- పాల్గొనన్న ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల క్రీడాకారులు**



**బయ్యారం క్రీడా, ఫిబ్రవరి 21(పిసిడబ్ల్యూ న్యూస్):** బయ్యారం మండల కేంద్రంలో శుక్రవారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేటి నుండి మూడు రోజుల వరకు బయ్యారం క్రీడా మైదానం నందు ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం అవుతున్నాయి కావున క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడలను విజయవంతం చెయ్యాలని నిర్వాహకులు తెలిపారు.ఈ క్రీడలు ఎన్నడూ లేని విధంగా నేషనల్ లెవల్ లో జరిగే విధంగా మ్యాట్స్ పై నిర్వహిస్తున్నారు.కావున క్రీడాకారులు మ్యాట్ షూ ఏర్పాటు చేసుకోగలరు. బయ్యారంలో అనేక మంది క్రీడా ప్రతిభావంతులు ఉన్నారని అందరి సహకారంతో అనేక క్రీడా పోటీలను నిర్వహించిన అనుభవం బయ్యారం స్పోర్ట్స్ క్లబ్ కు ఉందని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులు గమనించి సకాలంలో క్రీడా వేదిక కు చేరుకొని పోటీలను విజ వంతం చెయ్యాలని బయ్యారం స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు కోరారు.

## ప్రజాసేవలో ఆ దంపతుల కృషికి సలామ్..!

**గోదావరిఖని,ఫిబ్రవరి 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రామగుండం కార్పోరేషన్ 12వ డివిజన్ కార్తీక దీపం, పౌర్ణమి, మణికంఠ స్లమ్ సమైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం తాజా మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఇటీవల కార్పొరేటర్ గా పదవి కాలం పూర్తి అయిన సందర్భంగా మహిళా సంఘం సభ్యులు పూలమాలలతో శాలువాతో సత్కరించారు. మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలలో కార్పొరేటర్ గా బొడ్డు రజిత రవీందర్ దంపతులు చేసిన కృషి మరువలేనిదని 12వ డివిజన్ అభివృద్ధి అంటేనే బొడ్డు రజిత రవీందర్ అన్నారు. ఈ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడంతో పాటు కరోనా కష్ట సమయంలో చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సునీత , అయేషా , కవిత , సంధ్య , అరుణ , శిరీష , రాధ ,రజిత , మున్నమ్మ , భూలక్ష్మి, ప్రేమలత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కింద లబ్ధి పొందిన రైతులకు కొత్త పంట ఋణాలు మంజూరు చేయాలి

- డిపాజిట్లు,రుణాల రికవరిపై దృష్టి సారించాలి
- గడువులోగా లక్ష్యాలను సాధించాలి





**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రుణమాఫీ కింద లబ్ధి పొందిన రైతులకు తిరిగి కొత్త పంట ఋణాలు ఇవ్వాలని, సాంకేతిక కారణాలతో పంట రుణమాఫీ కానీ రైతుల ఖాతాలు మెరుగు పరిచి వారికి మాఫీ లబ్ధి చేకూరేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీ లోని డిసిసిబి బ్యాంక్ లో రాయపర్తి, నందనం, ఐనవోలు, వర్ధన్నపేట సోసిటీల్లు, ఐనవోలు, వర్ధన్నపేట డీసీసీబీ బ్యాంకుల మేనేజర్లు, నోడల్ అధికారులు,సొసైటీ సిబ్బందితో తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘాల ద్వారా ఇచ్చి ఉన్న ఋణాలను కూడా లీగల్ గా కవర్ చేసి రికవరీ చేయాలని, బ్యాంకు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, డిపాజిట్లు, బంగారు రుణాలపై దృషిసారిస్తూ బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ సమీక్ష సమావేశంలో నోడల్ అధికారినీ ఏజిఎం గొట్టం స్రవంతి, బ్రాంచ్ మేనేజర్లు సమత, శ్రావణ్, బద్రునాయక్,పాక్స్ చైర్మన్లు రాజేష్ ఖన్నా,రామచంద్ర రెడ్డి,సొసైటీ సీఈఓలు యాదగిరి, సంపత్, సోమయ్య, సిబ్బంది సురేష్, సమ్మయ్య,ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, ఫిబ్రవరి.20(పిసిడబ్ల్యూ న్యూస్):** రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి ఏర్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి ఎంపీఓ, ఎం.పి.డి.ఓ లు మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అందుకుగాను సమస్యాత్మక ప్రాంతాల్లో పైప్ లైన్లు మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. వేసవి కాలంలో నీటి సరఫరాలో సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో గుర్తించి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిపై దృష్టి పెట్టి ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నీటి పంపులు, మోటర్లు, వాల్స్ లు పైపులకు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ఆయా గ్రామాలను నీటి సరఫరా అధికారులు సందర్శించి అందుకు కావలసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీ సీ.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈ.ఈ కృష్ణారెడ్డి, ఎం.పి.ఓ, ఎం.పి.డి.ఓ లు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రావిణ్య

**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్దేశించిన వివిధ పనులను గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనులు, వాటి పురోగతి, రానున్న మార్చినాటికి సంబంధించి ఉపాధి పనుల గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం నిర్దేశిత పనులను పూర్తిచేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కోసం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మొక్కలు పెంపకానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించినవి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు, ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను పూర్తిస్థాయిలో కల్పించడం, నిర్దేశిత లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేటట్టు చూసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. డీఆర్డీవో మేన శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధి హామీ పని దినాల సంఖ్య నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు రెండు లక్షల యాభైనాలుగు వేలుగా నిర్దేశిత లక్ష్యంగా ఉందని, మిగతా నిర్దేశిత లక్ష్యాన్ని మార్చినాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేశారు. ప్రత్యేక ప్రణాళికతో వంద శాతం పనులను పూర్తి చేయాలన్నారు. అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈ శ్రీనివాస్ రావు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.



## జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం

- స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య
- స్వేరోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం
- జిల్లా అధ్యక్షులుగా మొండితోక ఈదయ్య



**ఖమ్మం, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యంగా పనిచేయాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య అన్నారు. ఖమ్మం నగరంలో గురువారం జరిగిన స్వేరోస్ సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య ప్రకటించారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా మొండితోక ఈదయ్య, కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా తగరం శ్రీకాంత్, మహేష్, గోవిందరాజు, కోశాధికారి రమణ, అధికార ప్రతినిధి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిలు సుధాకర్, వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధవి, కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నరసింహారావు, కృష్ణయ్య, మల్సూర్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య మాట్లాడుతూ... జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మత్తు పదార్థాలు నియంత్రణకై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



**హనుమకొండ, ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్ లోని తన చాంబర్లో గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి రవిందర్ లతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రచించాలని, అవగాహన, చైతన్యం కల్పించడం వల్ల సమాజంలో మార్పును తీసుకు రావచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గురించి, ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీసు, ఎక్సైజ్, టిఎస్ న్యాబ్, అటవీ, జీఆర్పీ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి రవీందర్ మాట్లాడుతూ ప్రతి నెల నార్కోటిక్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల కు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ ఆర్ ఓ సందీప్, నార్కోటిక్స్ డిఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ కుంట మాయం పట్టించుకోని రెవెన్యూ అధికారులు

- వివరణ కోరిన తహసిల్దార్ నిర్లక్ష సమాధానం

**రామడుగు,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గుండి గ్రామ రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 21 లో బతుకమ్మ కుంట 37 గుంటల భూమి కాస్ర పహానిలో ప్రభుత్వ భూమిగా రికార్డు నమోదయింది.. 2019 వరకు రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా నమోదు అయి ఉంది.. ఈ కుంటను బతుకమ్మకుంటగా గుండి గోపాల్ రావు పేట గ్రామస్తులు పిలిచేవారు.. ఈ కుంటలో వ్యవసాయ బావి లాగా ఉండి నీరు నిలిచేది.. నాటినుండి గత ఏడాది క్రితం వరకు ఈ ప్రభుత్వ భూమిలో బావి లాగా ఉన్న ప్రాంతంలో నీరు ఉండడంతో బతుకమ్మలను నిమజ్జనం చేసేవారు.. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ భూమిని పట్టాగా మార్చుకొని అధికారులకు అమ్యామ్యాలు ముట్టజెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది జూలై నెలలో ఈ ప్రభుత్వ భూమిపై పలు దినపత్రికలలో వార్త కథనాలు వెలువడ్డాయి.. దీంతో అప్పటి తాసిల్దార్ భాస్కర్ మండల సర్వేయర్ తో విచారణ జరిపి నివేదికను తెప్పించుకున్నారు.. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాన కురిసిన వర్షపు నీరంతా పురాతన వంతెన ప్రస్తుతం నాలుగు కోట్లతో నిర్మించిన నూతన బ్రిడ్జి కి సమీపాన ఉండడంతో వర్షపు నీరంతా బతుకమ్మ కుంట నుండి జాలు వారేది.. ఇందుకు సాక్ష్యం ఇదే స్థలంలో ప్రధాన రహదారిపై బ్రిడ్జిలు నిర్మించారు. ఈ విషయంపై మండల తాసిల్దార్ వెంకటలక్ష్మి పాత్రికేయులు వివరణ కోరగా మండల సర్వేయర్ ను పిలిపించి అడుగగా ఏడి ఆఫీసులో అసలు సేత్వార్ రికార్డు లేదని చెప్పారు.. కాస్రా పహాని మాత్రం తహసిల్దార్ కార్యాలయంలో ఉందని చెప్పారు. కాస్ర పహాని వివరాలు ఇవ్వాలని తహసిల్దార్ అడగగా మీరు దరఖాస్తు ఇస్తేనే ఇస్తాం.. లేదంటే ఇవ్వం.. మీరు ఏం రాసుకుంటారో రాసుకోండి.. అది మీ ఇష్టం.. మేము వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు అని నిర్లక్ష్యంగా బదులిచ్చారు..



## నేరం చేస్తే శిక్ష తప్పదు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పిపిలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ



**జగిత్యాల,ఫిబ్రవరి 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీ లను అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ది కీలకపాత్రని , పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయంతో నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుపడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పని చేయటం అభినదనియని అన్నారు. పోలీస్ ఆదికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందని అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా జమ చేయాలన్నారు. గడిచిన రెండు నెలల్లో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 14 మందికి జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని తెలిపారు. వెల్గటూరు పోలీస్ స్టేషన్ కు సంబంధించిన కేసులో ఒకరికి జీవిత ఖైదు, జగిత్యాల టౌన్, మల్యాల పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన పోక్సో. కేసులో ఒక్కరికీ 20 సంవత్సరాల జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని తెలిపారు. పై కేసుల్లో నిదితులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పీపీలు, రాజేష్ ,కోర్ట్ , జగిత్యాల, రజని , కోర్ట్ , జగిత్యాల ప్రణయ్ , కోర్ట్ , మెట్టుపల్లి, మల్లికార్జున్ కోర్ట్ , జగిత్యాల , కే .మల్లేశం , అడ్డల్ . కోర్ట్ జగిత్యాల, రామకృష్ణ రావు ఫస్ట్ ట్రాక్ కోర్ట్ , జగిత్యాల. పీపీలను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ యొక్క సమావేశంలో డిఎస్పీలు రఘు చందర్, రాములు, రంగారెడ్డి, పిపీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పీసీడబ్ల్యూ న్యూస్):** మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల బ్యాలెట్ బాక్సులను వేరువేరుగా ఏర్పాటు, విభజన స్పష్టంగా ఉండాలి అని అన్నారు.పోలీస్ బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు అమర్చాలని అన్నారు. ఫైరింజన్ 24గంటలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు పంపే ప్రతి బాలెట్ బాక్స్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి లాక్ సిస్టం సరిచూసుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల సిబ్బంది సమన్వయము తో పని చేయాలి అని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల చూపు మల్క కొమురయ్య వైపు

### - సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ఆదిలాబాద్,నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయులు మల్క కొమరవెయ్య వైపు చూస్తు న్నారని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి గునుకుల కొండాపూర్ గ్రామాలలో మల్క కొముర య్య గెలుపు కోసం ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు మల్క కొమురయ్య గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. సిపిఎస్ ఉద్యోగులు మల్క కొమురయ్య వెంటే ఉన్నారని అన్నారు. సిపిఎస్ ఉద్యోగులంతా మల్క కొమురయ్య గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలన్నా సిపిఎస్ విధానం రద్దు కావాలన్నా మల్క కొమురయ్య గెలవాల్సిందేనని అన్నారు. ఉపాధ్యాయుల ప్రశ్నించే గొంతుకగా మల్క కొమరయ్య అవుతారని అన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికలలో మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. భరత్ రెడ్డి, సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగ కృష్ణా నీళ్ల తరలింపు

### నిర్లక్ష్యంతో మొద్దు నిద్ర నటిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాగు నీరు, తాగు నీరు ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగుతుంటే కాంగ్రెస్ పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది.లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. వేసవిలో తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉంది. తెలంగాణ సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంతటి నష్టం జరుగుతుందో ఇవాళ కళ్ల ముందు కనబడుతున్నది. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజు 10వేల క్యూసెక్కుల నీళ్లు తరలించుకుపోతుంటే, తెలంగాణ ప్రభుత్వం చేవచచ్చి, చేష్టలుడిగి చేతులు కట్టుకొని చూస్తున్నారు. నీళ్ల మంత్రి నీళ్లు నములుతున్నడు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ భూభాగానికి నీళ్లు మళ్లించిన ప్రభుత్వం బీఆర్ఎస్ అయితే, చేతగాక నీళ్లు నములుతున్న ప్రభుత్వం ఇవ్వాళ కాంగ్రెస్. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి బెల్లం గొట్టిన రాళ్లలాగా చలనం లేకుండా పడి ఉన్నరు. కృష్ణా జలాల్లో ఏపీ తాత్కాలిక వాటా 512 టిఎంసీలు, కానీ ఇప్పటి వరకు 657 టీఎంసీలు తరలిస్తే మీ నోరు పెగలదా? మిమ్మల్ని ఎన్నుకున్నది ఎందుకు? గడిచిన 25 రోజుల్లోనే 60 టిఎంసీలు తరలించారు. అంటే రోజుకు రెండు టిఎంసీలు. తెలంగాణ నీటి ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్, తెలంగాణ ప్రజల పాలిట పెను శాపం. సీఆర్పీఎఫ్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆనాడు అసెంబ్లీలో తీర్మానం చేసినం. నాగార్జున సాగర్ ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకోవాలని కోరినం. నవంబర్ 30, 2023 నాడు ఏ స్టేటస్ లో ఉందో, అదే స్టేటస్ ఉండాలని తీర్మానం చేసినం. ఏడాది నుంచి చేతుల్లోకి తీసుకోవడంలో కాంగ్రెస్ ఫెయిల్. మన చేతిలో ఉండే కుడి కాల్వ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులు ఏపీ తీసుకుపోరు కదా. మీ చేతగాని తనం, నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు పెద్ద దెబ్బ తగిలే ప్రమాదం ఉన్నది. సీఆర్పీఎఫ్ బలగాల చేతిలో ఉన్న ప్రాజెక్టు నుంచి ఏపీ ఇష్టారాజ్యంగా నీళ్లు తరలిస్తున్నది. కేంద్ర ప్రభుత్వాన్ని అడుగవు, చంద్రబాబును అడుగవు. చంద్రబాబును అడిగే ధైర్యం లేదు. కేంద్రం ను అడిగే దమ్ము లేదు. ఎగురుమంటే విపక్షం మీద వికారపు భాషలో జానెడు జానెడు ఎగురుతడు. ఎగరాల్సిన చోట ఎగరటం చేతనైతలేదు. తెలంగాణ సాగు నీటి, తాగు నీటి అవసరాలకు నిల్వ ఉంచాల్సిన నీటిని ఏపీ తరలిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు. ఈ ఏడాదికి కృష్ణాలో 1010 టీఎంసీల నీళ్లు వచ్చాయి. తాత్కాలిక ఒప్పంద ప్రకారం అనుకున్నా ఏపీ 666 టీఎంసీలు రావాలి. కానీ ఏపీ ఇప్పటికే 657 టిఎంసీలు వాడింది. ఏపీకి మిగిలిన హక్కు కేవలం 9 టీఎంసీలే ఇవ్వాళ కూడా సాగర్ కుడి కాల్వలో 10వేల క్యుసెక్కులు పోతున్నయి. తెలంగాణకు ఆ రేషియో ప్రకారం చూసిన 343 టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావాలి. ఈరోజుకు తెలంగాణ వాడుకున్నది ఎంత అంటే 220 టీఎంసీ మాత్రమే. ఇంకా తెలంగాణకు 123 టీఎంసీలు రావాలి. 123 మరియు 9 టీఎంసీలు కలిపితే 132టీఎంసీ. శ్రీశైలం, సాగర్ లో కలిసి ఉన్న నీళ్లు 100 టీఎంసీలు. ఈ వందలో ఏపీ తరలిస్తూ ఉన్నది. తెలంగాణ నష్ట పోతున్నది. కాంగ్రెస్ గుడ్లు అప్పగించి చూస్తున్నది. ఏపీ నుంచి తెచ్చుకున్న మీ అడ్వైజర్ ఏం చేస్తున్నడు. ఇంజినీర్లు ఏం చేస్తున్నరు. నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నడు నాగార్జున సాగర్ ఎండీడీఎల్ 510, ఈరోజు ఉన్నది 50 టీఎంసీలు. శ్రీశైలం ఎండీడీఎల్ 834, ఈరోజు ఉన్నది 50టీఎంసీలు. రెండు కలిపి మొత్తం 100 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నయి తక్కువ తెలంగాణకు రావాల్సింది ఎక్కువ. ఇప్పటికైనా కళ్లు తెరవండి. అన్యాయం అడ్డుకోండి. యాసంగి పంటకు నీళ్లు ఇస్తమని కోట్లు పెట్టి పత్రికల్లో యాడ్స్ ఇచ్చారు. సాగర్ ఎడమ కాల్వ కింద నల్గొండలో లక్షా 45 వేల ఎకరాలు, సూర్యాపేటలో 2లక్షల 35వేల ఎకరాలు, ఖమ్మంలో 2లక్షల పైగా ఎకరాలు, మొత్తంగా 6లక్షల 38వేల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నరు. నాలుగు తడుల నీళ్లు ఇస్తే గాని పంటలు పండవు. దాదాపు 30, 35 టీఎంసీల నీళ్లు కావాలి. ఏఎంఆర్ ఎస్ఎల్బీసీ కింద 2లక్షల 40వేల ఎకరాల్లో పంట వేసారు. ఈ పంటలకు కూడా మూడు నాలుగు తడుల నీళ్లు ఇవ్వాలి. ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యపేట, హైద్రాబాద్ డ్రింకింగ్ వాటర్ నాగార్జున సాగర్ పై ఆధారపడి ఉంది. ఇప్పటికైనా కండ్లు తెరవండి. రైతుల పంటలు కాపాడాలంటే తక్షణం కేంద్రం మీద ఒత్తిడి తేవాలి. ఏపీ జలదోపిడిని తక్షణం అడ్డుకోవాలి. కేఆర్ఎంబీ ఆఫీసు ముందు ధర్నా చేద్దాం పదండి. పోదాం పదా కేంద్ర జలశక్తి మంత్రి కార్యాలయం ముందు ధర్నా చేద్దాం. మీకు చేతగాకుంటే మీ వెంట మేమూ వస్తాం. అఖిల పక్షాని తీసుకుపోండి. మిమ్మల్ని గెలిపించింది పంటలు ఎండగొట్టడానికా, తాగు నీటి కోసం ప్రజలు గోస పడడానికా. తక్షణమే సాగర్ కుడి కాల్వకు నీళ్లు విడుదల ఆపాలి. ముచ్చుమర్రి నుంచి తోడుతున్న నీళ్లను ఆపాలి. పోతిరెడ్డి పాడు ద్వారా తరలిస్తున్న నీటిని ఆపాలి. ఉన్న 100 టీఎంసీలన్నా మనం తెచ్చుకుంటే మన పంటలు ఎండవు. కొద్దో గొప్పో సర్దుకొని వ్యవహారం నడిపించవచ్చు. పంటలు దెబ్బతినడం కాదు, తాగు నీళ్లు కూడా లేని పరిస్థితి వస్తుంది. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నది. ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నది. ఏపీ ఇష్టం ఉన్నట్లు నీటిని తరలిస్తున్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి ఇక్కడ అధికారంలో ఉండటంతో నీటి తరలింపు సులువు అయ్యింది. పార్లమెంట్ లో బిఆర్ఎస్ ఉంటే మా వాళ్లు దద్దరిల్లింప చేసేవాళు . తెలంగాణ అంటేనే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటేనే తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ చెరో 8 మంది గెలిచి ఏం ప్రయోజనం. ప్రశ్నించే గొంతు పార్లమెంట్ లో లేదు. కాంగ్రెస్ కు సోయి లేదు, బిజేపికి పట్టి లేదు, రెండు పార్టీలు తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయి. కేంద్రంలో తనకున్న తిరుగులేని బలం వల్లనే చంద్రబాబు నాయుడు ఇష్టారీతిన జలదోపిడి చేస్తున్నడు. తెలంగాణ ముఖ్య మంత్రి ఆ జలదోపిడిని ప్రశ్నించకుండా, అడ్డుకోకుండా పరోక్షంగా సహకరిస్తున్నడు. రేవంత్ వైఖరి ఎంత బేలగా, ఎంత హాస్యాస్పదంగా ఉందంటే త్రిమెన్ కమిటీ సమావేశాన్ని డిమాండ్ చేసేంత సత్తా కూడా లేదు. ప్రతి సంవత్సరం కేఆర్ఎబీ పరిధిలోని ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మిటింగ్ పెట్టలేదు. అంటే బోర్డు వ్యవహారం ఎంతగా దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బోర్డు కేంద్రం కంట్రోల్ లో ఉందా, ఏపీ కంట్రోల్ లో ఉందా అనుమానం వస్తున్నది. కేంద్రం రెండు రాష్ట్రాలను ఎందుకు సమానంగా చూడటం లేదు. త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టకుంటే రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలి కదా. ఎందుకు చేయడం లేదు? బోర్డు పై సీరియస్ గా ఒత్తిడి చేయరు. త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టుమని డిమాండ్ చేయరు. నీళ్ళు తరలించుకు పోతుంటే శిలా విగ్రహాల్లాగా పడి ఉంటరు. ప్రేక్షక పాత్ర వహించడానికా మిమ్మల్ని ఎన్నుకున్నది. అప్పుడే నీటి ఎద్దడి ప్రారంభమైంది. సాగు నీటి కోసం సాగర్ ఆయకట్టు రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నరు. నేను బీజేపీని కూడా అడుగుతున్నా 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నరు. ఎందుకు ఎత్తుక తిననా? మొత్తుకు సావనా? కేంద్రం మంత్రిగా ఉండి కిషన్ రెడ్డి గారూ.. ఏం చేస్తున్నారు. మీకు బాధ్యత లేదా మీకు ఏపీ చేస్తున్న జలదోపిడి కనబడటం లేదా కృష్ణా బోర్డు మీ పరిధిలోనే ఉన్నది. మీరు ఆర్డర్ వేస్తే ఏపీకి తరలిపోతున్న నీళ్లు ఆగవా? ఏపీ జలదోపిడి కిషన్ రెడ్డి గారికి కనబడటం లేదా సికింద్రాబాద్ ప్రజలు కూడా తాగు నీటి సమస్య ఎదుర్కుంటారు మీరు ఏపీ నీళు తరలింపుపై రివ్యూ చేయండి. త్రిమెన్ కమిటీ ఎందుకు ఈ సారి సమావేశం కాలేదు. కమిటీ నిర్ణయించకుండా నీళ్ల తరలింపు ఎలా అని ప్రశ్నించండి. మీ ప్రతాపం మా మీదనేనా. సీఆర్పీఎఫ్ బలగాలు తక్షణం తొలగించాలని కిషన్ రెడ్డి గారిని కోరుతున్నా. కేసీఆర్ సాగర్ ను తెలంగాణ ప్రభుత్వం పరిధిలో ఉంచేందుకు కొట్లాడారు. మీరు ఎందుకు కొట్లాడటం లేదు. ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అవుతున్నది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు చణాకా కొరటా, చిన్న కాళేశ్వరం, గూడెం ప్రాజెక్టు ఇలా అనేక ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చాం. అనుమతులు కాదు కదా, చివరి దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులను సాధించడం లేదు. డిపిఆర్ లు వాపస్ అవుతున్నయి. పాలమూరు ప్రాజెక్టు, వార్ధా, కాళేశ్వరం మూడో టీఎంసీ డీపీఆర్ వెనక్కి వచ్చింది. సీతమ్మ సాగర్ కు అన్ని అనుమతులు తెచ్చినం. చివరి అనుమతి రావాల్సి ఉంటే, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ రిజెక్ట్ చేసింది. సమ్మక్క సాగర్ పరిస్థితి అట్లనే ఉన్నది. ప్రాజెక్టులకు అనుమతులు తేరు, ఉన్న నీటి కేటాయింపులను సక్రమంగా వినియోగించరు. ఉద్దేశ్యపూర్వకంగా మేడిగడ్డను పండబెట్టిన్రు. గట్టిగ చేస్తే ఆరు నెలల్లో చేసే పని. కాళేశ్వరం కూలి పోయిందని దొంగ ప్రచారం చేసారు. కాళేశ్వరంలో అనేక భాగాల ఉన్నయి. ఏడు బ్లాకుల్లో ఒక బ్లాకులో ఒక పియ్యర్ కుంగింది. దాన్ని రిపేర్ చేయకుండా చోద్యం చేస్తు న్నారు. రైతులు నీళ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నరు. కుట్రతో రిపేర్లు ఆలస్యం చేసి రైతుల నోట్లో మట్టి కొడుతున్నరు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే సీఎం చోద్యం చూస్తున్నరు.

## వివిధ పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు





**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: వ్యవసాయ శాఖ, కరీంనగర్ రైతు శిక్షణా కేంద్రం ఆత్మ ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్, ఒక సంవత్సరం కోర్సులో గన్నేరువరం మండలానికి చెందిన డీలర్స్ సందవేని ప్రశాంత్, బద్దం మహిపాల్ రెడ్డి, ఖాసీంపేట శిక్షణ తీసుకుంటున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలంలోని వివిధ పంటలపై వరి, మొక్కజొన్న పంటలో ఆశించిన పురుగు మరియు తెగులు పై క్షేత్ర సందర్శన నిర్వహించడం జరిగింది. ఖాసీంపేట్ గ్రామంలో మహిపాల్ రెడ్డి రైతు సాగు చేసిన బొప్పాయి పంటను సందర్శించి చీడపురుగులపై డీలర్లకు దేసి ఫెసిలిటేటర్ రామచంద్రరావు వివరించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి,రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత, ఆత్మ (బిటిఎం) స్రవంతి,శిక్షణ డీలర్స్ పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ పై మేధావుల సమావేశం నేడు...

### - సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి..

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(పీసీడబ్ల్యూ న్యూస్):** 2025 కేంద్ర బడ్జెట్ పై శుక్రవారం రోజున కరీంనగర్ లోని వైశ్య భవన్లో ఉదయం 10 గంటలకు మేధావులతో సమావేశం జరుగుతుందని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి హాజరవుతారని పేర్కొన్నారు. ఇట్టి సమావేశానికి మేధావులు, అడ్వకేట్లు, డాక్టర్లు, వ్యాపార వాణిజ్య వర్గాలు, పారిశ్రామికులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, సమాజ సేవకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# మూడు రోజులు ఎవరితోనూ నో కంటాక్ట్ : సమంత



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత.. తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా సామ్ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. సోషల్ మీడియా రాజ్యమేలుతున్న రోజుల్లో, ప్రతి ఐదు నిమిషాల్లో రెండు నిమిషాలు ఫోన్‌కే కేటాయిస్తున్న సమయంలో మూడు రోజులపాటు ఫోన్‌కు దూరంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. ఆ అనుభవాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "మూడు రోజులు సైలెంట్‌గా ఉన్నాను. ఫోన్ లేదు. ఎవరితో కమ్యూనికేషన్ లేదు. నాతో నేను మాత్రమే ఉన్నాను. మనతో మనం ఒంటరిగా ఉండడం కష్టమైన విషయాల్లో ఒకటి. అతి భయంకరమైనది. కానీ, ఇలా మౌనంగా ఉండడాన్ని నేను ఇష్టపడతాను. మిలియన్ సార్లు ఇలా ఒంటరిగా గడపమని చెప్పినా ఉంటాను. మీరు కూడా ఇలా ఉండటానికి ప్రయత్నించండి" అంటూ సూచనలిచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేసిన ఈ విషయం నెట్టింట వైరల్ అవుతోంది. జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న సమంత ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టినట్లు ఈ పోస్ట్ ద్వారా తెలుస్తోంది. ఇక సమంత సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె దృష్టి కథానాయికగా ప్రాధాన్యం ఉన్న చిత్రాలపై ఉంది. మరోవైపు ఓటీటీ వేదికగా భిన్నమైన కథలతో సత్తా చాటుతున్నారు. వరుణ్ ధావన్‌తో ఆమె నటించిన 'సిటడెల్ : హనీ బన్నీ' ప్రేక్షకులను అలరించింది. అయితే గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు నామినేట్ కాగా అడుగు దూరంలో అవార్డ్ మిస్ అయింది. తాజాగా ఈ వెబ్‌సిరీస్‌కు ఐకానిక్ గోల్డ్ అవార్డ్ లభించింది. ఉత్తమ వెబ్‌సిరీస్‌గా అవార్డు గెలుచుకుంది. ఈ విషయాన్ని సామ్ ఇన్‌స్టా వేదికగా తెలిపింది. ప్రస్తుతం 'రక్త్‌బ్రహ్మాండ్'తో బిజీగా ఉన్నారు సామ్. ది బ్లడీ కింగ్‌డమ్ అనేది ఉపశీర్షిక. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకుడు. ఇటీవలే ఈ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు సమంత చెప్పారు.. 'మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశా' అంటూ పోస్ట్ పెట్టారు. ఆదిత్యరాయ్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు తెరపైకి రాని కథతో దీన్ని రూపొందిస్తున్నారు.

# అల్లుఅర్జున్‌కు మరో ఘనత

**● ఏకంగా హాలీవుడ్**

**కవర్ పేజీలో బన్నీ ఫొటో**




ఐకాన్‌స్టార్ అల్లు అర్జున 'పుష్ప' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. సుకుమార్ దర్శకత్వం మాస్ మసాలా యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు హాలీవుడ్‌ను సైతం ఆకర్షించింది. తెలుగు సినిమాకు ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డు తీసుకొచ్చిన బన్నీ ఇప్పుడు మరో ఘనతను తన సొంతం చేసుకున్నారు. ప్రముఖ సినిమా మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' పేరుతో భారత్‌లోనూ అడుగుపెట్టేసింది. ఈ మ్యాగజైన్ తొలి సంచిక అల్లు అర్జున్ ఫొటోతో రానుంది. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటో షూట్‌ను నిర్వహించారు. ఆ బీటీఎస్ ప్రోమో వీడియోను తాజాగా షేర్ చేశారు. అందులో అల్లు అర్జున్ పంచుకున్న కొన్ని విషయాలను చూపించారు. 'సినిమాకు హద్దులు లేవని నిరూపించిన స్టార్ అల్లు అర్జున్: ది రూల్" పేరుతో ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాలో ఇంటర్వ్యూ రానుంది. ఇందులో అల్లు అర్జున్ ఇప్పటివరకు సాధించిన విజయాలను వివరించనున్నారు. 'పుష్ప 2' విజయంపై ఆసక్తికర వివరాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ చెప్పిన కొన్ని విషయాలు.."ఇండియన్ బాక్సాఫీస్ వద్ద నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాను. నా జీవితంలో లభించిన అతిపెద్ద అవకాశం ఇదే అని భావిస్తున్నా. బలం, ఆత్మవిశ్వాసం అనేవి మనసులో ఉంటాయి. వాటిని ఎవరూ తీసేయలేరు. ప్రతి మనిషికి కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. ఇది అలాంటిదే. విజయం తర్వాత కూడా వినయంగా ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అయిన తర్వాత కూడా ఎలాంటి గర్వం లేని చాలా మందిని నేను చూశా. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఇకపోతే నేను 100 శాతం సామాన్యుడిని. సినిమా చూస్తున్నప్పుడు కూడా ఇదే భావనతో ఉంటాను. అలాగే విరామ సమయంలో కేవలం విశ్రాంతి మాత్రమే తీసుకుంటాను. ఏమీ చేయకుండా ఉండటమే నాకిష్టం. కనీసం పుస్తకం కూడా చదవను" అని ఆ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ వివరించారు. ఈ ఇంటర్వ్యూలో బన్నీ ఇంకేం చెప్పుకొచ్చాడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఛావాను రిజెక్టు చేసిన మహేష్‌బాబు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమా కథ మొదట సూపర్ స్టార్ మహేశ్ బాబు దగ్గరికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ మూవీ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ శంభాజీ పాత్ర కోసం మొదట మహేశ్ బాబు సంప్రదించినట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ నచ్చని మహేశ్ రిజెక్ట్ చేశాడు. దీంతో చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే కథతో విక్కీ కౌశల్ దగ్గరికి వెళ్లగా విక్కీ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. అయితే మహేశ్‌కి ఇలా సూపర్ హిట్ అయిన సినిమాలు రిజెక్ట్ చేయడం కొత్తేమి కాదు. ఇంతకుముందు కూడా మురుగదాస్ దర్శకత్వంలో వచ్చిన గజిని సినిమాను, అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాను రానా నటించిన లీడర్, రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన యానిమల్, ప్రభాస్ వర్షం, రవితేజ ఇడియట్, విజయ్ దళపతి నన్బన్, నాగ చైతన్య ఏ మాయ చేసావే, పూరీ జనగణమన (ప్రాజెక్ట్ స్టార్ట్ కాలేదు) తదితర సినిమాలను మహేశ్ రిజెక్ట్ చేశాడు.




# దాదాపు పూర్తయిన వార్-2 షూటింగ్

**● ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు..**

బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్ , టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ స్పై థ్రిల్లర్ ఇది. ఈ చిత్రానికి రైటర్ గా పని చేస్తున్న అబ్బాస్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. "వార్ 2' షూటింగ్ దాదాపు పూర్తయింది. ఆగస్టు 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఆరోజు హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను థియేటర్‌లో కలుద్దాం. 'వార్ 2'లో డైలాగులన్నీ నేనే రాశాను. అందరికి నచ్చేలా ఉంటాయి. షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల కాంబోలో ఓ సినిమా ప్రారంభం కానుంది. 'పఠాన్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాలకు రచయితగా వర్క్ చేస్తున్నాను. " అని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ తెలిపారు. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్‌హిట్ కావడంతోపాటు భారీ వసూళ్లు రాబట్టింది. సినిమాపై అంచనాలు ఉండటంతో దీనికి సీక్వెల్‌గా 'వార్2' తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రల్లో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ ఓ షెడ్యూల్ చేసి వచ్చారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొనున్నారు.





# రామ్‌చరణ్‌తో నటించనున్న రష్మిక

అగ్ర కథానాయిక రష్మిక మందన్న పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోతున్నది. 'పుష్ప-2'తో గత ఏడాది పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్న ఈ సొగసరి తాజాగా 'ఛావా' సినిమాతో మరో సూపర్‌హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. 'ఛావా' సినిమాలో ఈ భామ అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న రష్మిక మందన్న తాజాగా తెలుగులో మరో భారీ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని వార్తలొస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం రామ్‌చరణ్ ఓ స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్న విషయం తెలిసిందే. బుచ్చిబాబు సానా దర్శకుడు. ఈ సినిమా తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'రంగస్థలం' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాల్ని పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌పై దృష్టి పెట్టారు దర్శకుడు సుకుమార్. గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరువయ్యేలా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్న ఎంపిక చేసే ఆలోచనలో చిత్రబృందం ఉందని తెలిసింది. చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకూ కలిసి నటించలేదు. దీంతో వీరిద్దరి జోడీ కొత్తగా ఉంటుందనే ఆలోచనలో దర్శకుడు సుకుమార్ ఉన్నారని అంటున్నారు. అయితే ఈ సినిమా పట్టాలెక్కడానికి ఇంకా చాలా సమయం ఉండటంతో కథానాయిక విషయంలో లెక్కలు మారే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఎక్కువ శాతం రష్మికకే అవకాశాలున్నాయని ఫిల్మ్ సర్కిల్స్‌లో టాక్ నడుస్తున్నది.

# ఆసక్తిరేపుతున్న ఓదెల-2



టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం ఓదెల 2. సంపత్ నంది ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తోన్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్నాడు. ఓం నమ: శివాయ.. అంటూ తమన్నా శివశక్తి లుక్ ఇప్పటికే నెట్టింట పోస్టర్లు వైరల్ అవుతున్నాయని తెలిసిందే. ఈ చిత్రంలో తమన్నా మహదేవ్‌కు పరమభక్తురాలిగా, ఓదెల సద్గుణ రక్షకురాలిగా కనిపించనుంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరనుంది. ఓదెల 2 టీజర్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ మేళాలో ఫిబ్రవరి 22న లాంచ్ చేయనున్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో టీజర్ లాంచ్ చేసుకోబోతున్న తొలి ఇండియన్ సినిమాగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ లాంచ్ ఈవెంట్‌కు చిత్రయూనిట్, మేకర్స్ హాజరుకానున్నారు. మొత్తానికి దేశమంతా మహాకుంభ్ మేళావైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడే టీజర్ లాంచ్ సినిమాపై అందరి అటెన్షన్‌ను తమవైపునకు తిప్పుకుంటోంది. ఈ చిత్రంలో వశిష్ఠ ఎన్ సింహా, హరిప్రియ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్, మధు క్రియేషన్స్‌పై తెరకెక్కిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ ఈ మూవీకి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఓదెల 2 కోసం తమన్నా శివశక్తి రూపంలోకి ఎలా మారిందని తెలియజేస్తూ మేకింగ్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్.